
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం, 10, మే, 2024







అప్పన్న నిజరూప దర్శనం నేడు


- ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనాలు
- రాత్రి 7 గంటల వరకే దర్శనాల క్యూల్లోకి అనుమతి
- రాత్రి 8.30 గంటలకు స్వామికి సహస్ర ఘటాభిషేకం
- అనంతరం తొలివిడత చందనం సమర్పణ




చందనంలో సుగంధ ద్రవ్యాలు కలుపుతున్న అర్చకులు, అప్పన్న నిజరూపం



సింహగిరిపై ఏర్పాటు చేసిన దర్శనం క్యూలు



సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వేళయింది. ఏడాది పొడవునా చందన పూతతో దర్శనమిచ్చే స్వామిని నిజరూపంలో దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామివారిపై ఉన్న చందనాన్ని ఒలిచి నిజరూప భరితుడిని చేస్తారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త కుటుంబసభ్యులకు తొలిదర్శనం కల్పించిన తదుపరి ఉదయం 4 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నారు. రాత్రి 8.30 గంటల నుంచి స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. సింహగిరిపై గంగధార నుంచి తీసుకువచ్చిన కలశాల్లోని నీటితో స్వామికి అభిషేకం చేస్తారు. విశేష పూజల అనంతరం స్వామికి తొలి విడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

ప్రత్యేక ఏర్పాట్లు : చందనోత్సవానికి ఈ సారి లక్ష మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు 300, 1000, 1500 రూపాయల దర్శనం టిక్కెట్ల క్యూలు ఏర్పాటు చేశారు. వారికి కేటాయించిన స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతిస్తారు. రాత్రి 7గంటలలోపు మాత్రమే సింహగిరిపై దర్శనాల క్యూల్లోకి భక్తులను అనుమతిస్తారు. అనంతరం క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6గంటల వరకు మాత్రమే సింహగిరిపైకి బస్సుల్లో భక్తులను అనుమతిస్తారు. ఒకేసారి 29వేల 300మంది భక్తులు వేచి ఉండేలా సింహగిరిపై 46వేల రన్నింగ్‌ఫీట్ మేర దర్శనాల క్యూలను ఏర్పాటు చేశారు. భక్తులకు నీడ కోసం ప్రస్తుతం 56వేల ఎస్ఎఫ్‌టీ మేర ఉన్న పర్మినెంట్ షెడ్లు ఉండగా.. చందనోత్సవం సందర్భంగా అదనంగా మరో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీఐ షీట్లతో షెడ్లు వేశారు.

పటిష్టంగా బందోబస్తు

జీవీఎంసీ సహకారంతో మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ చేపట్టనున్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో క్యూల్లో శీతల పానీయాలు, పండ్లు, ఆహారపదార్థాలు అందించనున్నారు. కొండదిగువ ఆరు చోట్ల హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి బస్సుల్లో సింహగిరికి భక్తులను చేరుస్తారు. కలెక్టర్ మల్లికార్జున, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జీవీఎంసీ, ఫైర్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో చందనోత్సవం ఏర్పాట్లు చేశారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆధ్వర్యంలో 2,590మంది సివిల్ పోలీస్, నాలుగు ప్లాటూన్ ఏఆర్, స్పెషల్ రోప్‌పార్టీలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్నిశాఖల అధికారులతో జాయింట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం ఉదయానికే పోలీసులు సింహాచలం చేరుకోగా వారికి అధికారులు డ్యూటీలు కేటాయించారు.

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు

అప్పన్న స్వామికి శుక్రవారం రాత్రి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనంలో దేవస్థానం అర్చకులు గురువారం పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు.

చందనోత్సవ ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: సింహగిరిపై చందనోత్సవ ఏర్పాట్లను గురువారం సాయంత్రం కలెక్టర్ ఎ.మల్లికార్జున పోలీస్ కమిషనర్ రవిశంకర్, జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి పరిశీలించారు. చందనోత్సవ నిర్వహణలో ఏయే శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై పరిశీలన జరిపారు. తొలుత కొండదిగువ తొలిపావంచా వద్ద ఏర్పాట్లు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మినీ బస్సులో ప్రయాణించి కొండపైకి వెళ్లి, సింహగిరిపై దర్శన క్యూలు, బారికేడ్లు, షామియానాలు, తాగునీరు, మజ్జిగ వితరణ కేంద్రాలను పరిశీలించారు. బస్టాప్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ, పోలీసు, దేవస్థానం అధికారులకు దిశానిర్దేశం చేశారు. టిక్కెట్లు జాగ్రత్తగా స్కాన్ చేయాలని, రూ.300, 1000, 1500 క్యూలైన్లలో వచ్చే భక్తులకు సూచనలు అందించాలని చెప్పారు. అనువంశిక ధర్మకర్త దర్శనాలు, టీటీడీ దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై దేవదాయశాఖ అధికారులకు సూచనలు చేశారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు అనౌన్స్ చేయించాలని సూచించారు. ఆలయంలోకి భక్తులు చేరుకునే మార్గాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సీపీ పోలీసులను ఆదేశించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

ఓట్ల పండక్కి ఆహ్వానం



మహారాణిపేట: ఎన్నికల పండగలో ఓటర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ నెల 13న ఓటరు మహాశయులంతా వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ మేరకు ఆహ్వాన పత్రికను ప్రచురించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల్లో నచ్చిన అభ్యర్థులను ఎన్నుకోవాలని అభ్యర్థించారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ సారి జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం పలు పద్ధతుల్లో ఓటర్లకు అవగాహన కల్పించింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అవగాహన సదస్సులు, 5కె రన్, కరపత్రాల పంపిణీ, స్వీప్ పేరిట పలు కార్యక్రమాలు నిర్వహించింది.

కొనసాగుతున్న టీడీపీ ప్రలోభాల పర్వం

విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ

మధురవాడ: భీమిలి నియోజకవర్గం జీవీఎంసీ 5, 7 వార్డుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం మధ్యాహ్నం విచ్చల విడిగా డబ్బులు పంపిణీ చేశారు. ప్రియదర్శిని కాలనీ దోభీ ఖానా వద్ద ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో 7వ వార్డుకు చెందిన టీడీపీ ముఖ్యనేతతో పాటు 5వ వార్డు ముఖ్యనాయకులు, గంటా నియమించిన పర్యవేక్షకుల ఆధ్వర్యంలో డబ్బులు పంపిణీ చేశారు. వాటర్ ట్యాంక్, స్వతంత్రనగర్ పార్కు సమీపంలోని సచివాలయం ఎదురు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు స్లిప్పులు తనిఖీలు చేసి మరీ డబ్బులు పంపిణీ చేశారు. పట్ట పగలు అడ్డూ.. ఆపూ లేకుండా టీడీపీ నాయకులు డబ్బులు పంపిణీ చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఇంత జరగుతున్నా ఎన్నికలు అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రియదర్శినికాలనీలో డబ్బులు ఇచ్చేందుకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు

ఇదేనా తెలివి.. శ్రీభరత్

- ఎలక్షన్ కమిషన్ విశ్వసనీయతనే తప్పుపడుతున్న వైనం
- ఏయూలో ఈవీఎంలు భద్రపరచొద్దంటూ ఈసీకి లేఖ
- ఈవీఎంలు ట్యాంపర్ చేస్తారంటూ అర్థం పర్థంలేని ఆరోపణలు
- ఏ ఎన్నికలైనా ఈవీఎంలు ఏయూలోనే..
- ఈవీఎంల రక్షణ వలయం గురించి తెలియకుండా అవాకులు



సాక్షి, విశాఖపట్నం : విద్యావంతుడినంటూ గొప్పలు చెప్పుకుంటున్న టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్.. ఎన్నికల్లో గెలవలేనని తెలిసి రోజు రోజుకీ దిగజారిపోతున్నారు. అక్రమాలకు కేరాఫ్‌గా మారిన దివంగత తాత అడుగు జాడల్లోనే నడుస్తూ.. తన సొంత వర్సిటీ కోసం దేవాలయంలాంటి ఆంధ్ర విశ్వవిద్యాలయంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు కేంద్రంగా మారిన ఏయూలో ఈవీఎంలు భద్రపరచొద్దంటూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం అందరినీ ఆగ్రహానికి గురిచేస్తోంది. ఈవీఎంల రక్షణ వలయం గురించి తెలియకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విశ్వసనీయతనే తప్పుపడుతున్న ఆయన వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏయూపై ఈసీకి లేఖతో కలకలం

తాజాగా రిటర్నింగ్ అధికారికి రాసిన ఒక లేఖ భరత్ బేలతనాన్ని, అవివేకాన్ని, తేటతెల్లం చేస్తుంది. భారత ఎన్నికల సంఘంపై కానీ, భారతదేశ ఎన్నికల ప్రక్రియపై కానీ భరత్‌కు ఎలాంటి నమ్మకం, విశ్వాసం లేదనే విషయం స్పష్టమవుతోంది. ఆంధ్ర యూనివర్సిటీలో ఈవీఎంలను భద్రపరిస్తే వాటిని ట్యాంపరింగ్ చేస్తారని, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఈవీఎంలను మార్పు చేసేస్తారంటూ ఏకంగా రిటర్నింగ్ అధికారికి లేఖ రాయడం కలకలం రేపుతోంది.

ఈ విషయం తెలుసా ?

అసలు పూర్వాపరాలేవీ తెలియకుండా ఇష్టంవచ్చినట్లు మాట్లాడటం భరత్‌కు వారసత్వంగా వచ్చినట్లుందని అందరూ నవ్వుతున్నారు. వాస్తవానికి ఈనెల 13న జరిగే ఎన్నికల తరువాత ఈవీఎంలను ఏయూలో భద్రపరచాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. దీనికోసం ఏయూ ప్రాంగణాన్ని వారు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈవీఎంల భద్రపరిచే భవనంలోకి ఈగ కూడా దొరబడే వీలు లేకుండా అవసరమైన అన్ని చర్యలను దాదాపు నెల రోజుల నుంచి ఎన్నికల అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ జిల్లాకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు ఏయూలోనే భద్రపరుస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా అక్కడే సజావుగా నిర్వహిస్తున్నారు. ఇన్ని దశాబ్దాలుగా ఎప్పుడూ ఏ ఒక్క ఓటు గానీ, ఈవీఎం, బ్యాలెట్ బాక్సు కానీ ట్యాంపరింగ్ జరగలేదు. అందుకే ఎన్నికల కమిషన్ ఎప్పుడూ ఏయూనే ఎంపిక చేస్తుందన్న విషయం తెలియకుండా చేసిన ఆరోపణలతో భరత్ ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈసీపై విశ్వాసం లేదా..?

ఎన్నికల సంఘాన్ని దాని విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా శ్రీ భరత్ లేఖ రాశారు. ఈవీఎంల భద్రతకు పటిష్టమైన రక్షణ వలయంలో చుట్టూ సీసీ కెమెరాల నిఘా కూడా ఉంటుంది. ఈవీఎంలు భద్రపరిచిన ప్రాంతం.. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో కానీ, రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఆధీనంలో కానీ ఉండవు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ప్రత్యేక బలగాల ఆధ్వర్యంలో ఈవీఎంలను భద్రపరుస్తారు. వీటి జోలికి వెళ్లడం గానీ, వాటిని చూడడం కానీ, వాటిని ముట్టుకోవడం కానీ, వాటిని ట్యాంపరింగ్ చేయడం కానీ ఎవరి వల్ల సాధ్యం కాదు. ఇంత చిన్న విషయం కూడా తెలియకుండా.. ఎంపీ బరిలో రెండో సారి ఎలా పోటీ చేస్తున్నారంటూ విశాఖ వాసులు, విద్యావంతులు ఆశ్చర్యపోతున్నారు. ఇలాంటి వారికి ఓటేస్తే తమ ఓటు వృథాగా మారినట్లేనని భావిస్తున్నారు. భరత్ రాసిన లేఖపై టీడీపీ నాయకులే మండిపడుతున్నారు.

టీచర్లనీ మార్చేయ్యాలంట.?

ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని మారిస్తే సరిపోదు అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల్ని కూడా మార్చేయాలి అని భరత్ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న టీచర్లందరినీ కించపరిచేవిధంగా మాట్లాడటం కూడా భరత్ దిగజారుడు తనానికి నిదర్శమని చెప్పవచ్చు. మరో విషయం ఏమిటంటే.. గీతం విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఆచార్యులను భరత్ బలవంతంగా భీమిలి, విశాఖ తూర్పు, గాజువాక నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలంటూ హుకుం జారీ చేశారు. దీంతో పాఠాలు చెప్పుకునే మమ్మల్ని ఇలా ప్రచారానికి తిప్పడంపై వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): సమాజ్ వాది పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శరత్‌బాబు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయనకు వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల ముంగిటకే అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాజ్యసభ నిధులు వెచ్చించి ఉత్తరను అభివృద్ధి చేస్తానని చెప్పారు. కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో రూ.435 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. శరత్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడినై తమ పార్టీ కార్యకర్తలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. జగనన్నతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కె.వి.బాబా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కె.కె.రాజు సమక్షంలో శరత్‌బాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

టీడీపీ ర్యాలీలో బాణసంచాతో ఆటో దగ్ధం


బక్కన్నపాలెంలో టీడీపీ ర్యాలీలో మందుగుండు సామగ్రితో కాలిపోయిన ఆటో

మధురవాడ : భీమిలి నియోజకవర్గం బక్కన్నపాలెంలో టీడీపీ నిర్వహించిన ర్యాలీలో కాల్చేందుకు బాణసంచాతో తీసుకెళ్తున్న ఆటో గురువారం మధ్యాహ్నం దగ్ధమైంది. నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చడం వల్లే ఇలా జరిగింది. బక్కన్నపాలెంకి చెందిన పోతిన శివ అనే వైఎస్సార్‌సీపీ నాయకుడు టీడీపీలో చేరేందుకు ఆ పార్టీ కార్యకర్తలు, అనుచరులతో ర్యాలీగా పీఎంపాలెం వి కన్వెన్షన్ సెంటర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో ర్యాలీ బక్కన్నపాలెం గ్రామం నుంచి సాయిప్రియ గార్డెన్ రోడ్డులోకి వచ్చేసరికి మందుగుండు సామగ్రితో వస్తున్న ఆటోలో ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దీంతో ర్యాలీకి వచ్చిన వారు పరుగులు తీశారు. డ్రైవర్ కొయ్యాన కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వైద్యం నిమిత్తం పీఎం పాలెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తక్షణమే తేరుకున్న కొందరు కార్యకర్తలు కాలుతున్న ఆటోపైకి నీరు పోసి మంటలు ఆర్పారు. దీనిపై పీఎంపాలెం పోలీసులు, ఎన్నికల అధికారులు ఆరా తీస్తున్నారు.

విజయ్ దేవరకొండ సందడి


నగరంలో సందడి చేసిన విజయ్ దేవరకొండ

కొమ్మాది : విశాఖపట్నంలో నటుడు విజయ్ దేవరకొండ సందడి చేశారు. యారాడ బీచ్ వద్ద ఆయన నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఉదయం అక్కడ షూటింగ్ చూసుకుని సాయంత్రం నోవోటెల్‌కు చేరుకుంటున్నారు. విజయ్ దేవరకొండను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుంటున్నారు.

ప్రచార పర్వం


68వ వార్డు మిందిలో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ - అక్కిరెడ్డిపాలెం


ఆరిలోవలో ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సతీమణి నాగజ్యోతి - ఆరిలోవ


23వ వార్డు ప్రియదర్శిని కాలనీలో స్థానికులను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు - సీతమ్మధార

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

- కాపు, తెలగ, బలిజల ఆత్మీయ సమావేశంలో బొత్స ఝాన్సీ, కె.కె.రాజు

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 49వ వార్డులోని వైభవ్ ఫంక్షన్ హాల్‌లో కాపు నాయకుడు జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన కాపు, తెలగ, బలిజల ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో కాపులతోపాటు అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగిందని కె.కె.రాజు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం మళ్లీ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విశాఖ ఆడపడుచు బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా, ఎమ్మెల్యేగా తనని గెలిపించాలని కె.కె.రాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, పార్టీ శ్రేణులు, పెద్ద ఎత్తున కాపు వర్గీయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు. చిత్రంలో బొత్స ఝాన్సీ

చంద్రబాబు సభ వెలవెల



సీతంపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నగరంలోని సీతంపేటలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభ చప్పగా సాగింది. నగర పరిధిలోని విశాఖ ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి సభ జరిగినప్పటికీ జనం లేక వెలవెల పోయింది. అనుకున్న స్థాయిలో సభకు జనం రాకపోవడంతో సాయంత్రం 6 గంటలకు మొదలు కావాల్సిన సభ 7.30 గంటలకు ప్రారంభం అయింది. నాలుగు నియోజకవర్గాల నుంచి వేలాదిగా జనం తరలివస్తారనుకుంటే కేవలం రెండు మూడువేల మంది రావడంతో చంద్రబాబు పార్టీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరా చంద్రబాబు ప్రసంగం మొదలుపెట్టాక అమలు కానీ హామీలు గుప్పిస్తుండడంతో జనం మధ్యలోనే ఇంటి దారిపట్టారు. సుమారు గంట సేపు చేసిన ప్రసంగంలో సూపర్ సిక్స్ పథకాలపై సొంత డబ్బా కొట్టుకున్నారు. ఐదేళ్లలో ఏడాదికి నాలుగు లక్షలు చొప్పున 20 లక్షల ఉద్యోగాలు యువతకు ఇస్తానని చెప్పడంతో , గత ఎన్నికల సమయంలో చెప్పిన ఇంటికో ఉద్యోగం, బాబు వస్తే జాబు హామీలను జనం గుర్తు చేసుకుని నవ్వుకున్నారు. ప్రసంగం మధ్యలో ఇక్కడి ఎమ్మెల్యే పనికిమాలిన వాడని చంద్రబాబు అనడంతో పక్కనే ఉన్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజు కల్పించుకుని ఎమ్మెల్యే కాదు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అని చెప్పారు. చంద్రబాబు సభ కారణంగా సీతంపేట రోడ్‌లో రాకపోకలు నిలిపివేయడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

టీడీపీ సమావేశంలో జీవీఎంసీ ఉద్యోగులు


ప్రచారంలో మలేరియా విభాగం ఉద్యోగులు

మధురవాడ: భీమిలి నియోజకవర్గం పీఎం పాలెం వి.కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన టీడీపీ మహిళా విభాగం సమావేశంలో జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 మలేరియా విభాగం ఉద్యోగులు ఇద్దరు పాల్గొని నిబంధనలు ఉల్లంఘించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గంటా శ్రీనివాసరావు, భరత్ హాజరైన సమావేశంలో లొడగల భవానీ, ఎస్.సంతోషి పాల్గొన్నారు. ఈ వ్యవహారంపై జీవీఎంసీ, ఎన్నికల అధికారులు ఆరా తీస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురికి జైలు, జరిమానా

విశాఖ లీగల్: మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తిని అతికిరాతకంగా కొట్టి, మృతికి కారణమైన ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి ఎం.వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరు లక్ష రూపాయల చొప్పున జరిమానా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు బండా దేవుడు(43) నగరంలోని ఓ సిల్క్ హౌస్‌లో డ్రైవర్‌గా పని చేసేవాడు. కంచరపాలెం దగ్గర సంజీవయ్య కాలనీ–2లో నివసించేవాడు. 2013 అక్టోబరు ఒకటో తేదీ ఉదయం దేవుడు తన విధులకు బయలుదేరాడు. దారిలో నిందితులు పి.మధు, మట్టా సోమశేఖర రాజు, లింగాల అనిల్ కలిసి మద్యం కోసం డబ్బులు కావాలని దేవుడిని అడిగారు. తన వద్ద డబ్బులు లేవని ఆయన చెప్పడంతో ముగ్గురు కలిసి తీవ్రంగా కొట్టారు. తీవ్ర గాయాలతోనే దేవుడు ఉద్యోగానికి వెళ్లాడు. ఆయన పరిస్థితి చూసిన కార్యాలయం యజమాని.. దేవుడి భార్య పార్వతికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి భర్తను ఇంటికి తీసుకెళ్లింది. తీవ్ర గాయాలతో కడుపునొప్పి రావడంతో సాయంత్రం 6 గంటల సమయంలో దేవుడిని కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో చనిపోయాడు. నిందితులపై కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పటి సీఐ పాపారావు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో స్పష్టం చేశారు. అలాగే సెక్షన్ 341 కింద రెండేళ్ల జైలు రూ.500 జరిమానా చెల్లించాలని కూడా పేర్కొన్నారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు జరగాలని న్యాయమూర్తి పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- మాదిగ మహాసేన అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్


కంచరపాలెంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న మాదిగ మహాసేన నాయకులు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను భారీ మెజారిటీతో గెలిపించాలని మాదిగ మహాసేన అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ కోరారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా గురువారం 54వ వార్డు కంచరపాలెం, 104 ఏరియా, మద్రిపాలెం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మాదిగ మహాసేనకు సంఘీభావం తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి మాదిగల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని మాదిగలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే మంచి స్థాయిలో ఉన్నారని తెలిపారు. విద్య, వైద్యం అనేక రంగాల్లో మెరుగైన పాలన జగన్ చూపించారన్నారు. రాష్ట్రంలోనే ఎన్నడూ లేని విధంగా మంత్రుల కోటలో తొలిసారిగా ఒక మాదిగ మహిళకు హోంశాఖ ఇచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ముప్పిడి నర్సింగరావు, అచ్యుతరావు, చిరంజీవి, ప్రసాద్, దుర్గారావు, శివప్రసాద్, రమేష్, శ్రీను, గోపి, వినయ్, ఎలమంద, పలు జిల్లాల నుంచి మాదిగ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం జిల్లా ఎన్నికల అధికారులు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈవీఎంలకు రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తిచేశామని కలెక్టర్ తెలిపారు. క్లిష్టమైన పోలింగ్ స్టేషన్ల వద్ద అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశామని సీపీ చెప్పారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని వివరించారు. డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే మా మద్దతు

- రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు రెడ్డి


మాట్లాడుతున్న రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు రెడ్డి, డైరెక్టర్లు అప్పలరెడ్డి, శ్రీనివాసరెడ్డి

తగరపువలస: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రెడ్డి, రెడ్డిక సామాజిక వర్గమంతా సిద్ధంగా ఉందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు రెడ్డి అన్నారు. గురువారం చిట్టివలస వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన కార్పొరేషన్ డైరెక్టర్లు శీరపు అప్పలరెడ్డి, సుగ్గు శ్రీనివాసరెడ్డి, రౌతు భాస్కరరెడ్డితో కలిసి మాట్లాడారు. తాము ఇచ్ఛాపురం నుంచి చిత్తూరు వరకు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ నెల 11 వరకు విశాఖ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థుల గెలుపునకు ప్రచారం చేయనున్నామన్నారు. రెడ్డి, రెడ్డిక సామాజిక వర్గాల ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల వరకు ఉన్నారన్నారు. సీఎం జగన్ ఈ వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర రెడ్డి, రెడ్డిక సామాజికవర్గానికి ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ పదవులు ఇచ్చేలా సీఎం జగన్‌ను ఎన్నికల తరువాత కోరతామన్నారు.

నగదు పంచుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల అరెస్టు

- రూ.1,58,160 స్వాధీనం

అల్లిపురం: ఓటర్లకు డబ్బులు పంచుతున్న నలుగురు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలను గురువారం మహారాణిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,58,160 స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. దండుబజారులో డబ్బులు పంచుతున్న వ్యక్తి నుంచి రూ.50,000, సాలిపేటలో డబ్బులు పంచుతున్న ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.1,08,160 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈట్ రైట్ క్యాంపస్‌గా హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి


అవార్డు అందుకుంటున్న హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ యు.ఎం.శెట్టి

అగనంపూడి(గాజువాక): భారత ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన ఈట్ రైట్ క్యాంపస్ అవార్డుకు విశాఖ జిల్లా అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా సంస్థ ఎంపికైంది. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహించడం, పరిశుభ్రత, రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన ఆహారం అందించడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ అవార్డును అందించింది. ఈమేరకు భారత ఆహార భద్రతా, ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రనాథ్ చివులూరి ఈ అవార్డును గురువారం హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ యు.ఎం.శెట్టికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చడ, ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఆహారాన్ని అందివ్వడం, పరిశుభ్రత పాటించడం వల్ల ఈ అవార్డును సాధించామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఈ అవార్డుకు ఎంపికైన మొట్టమొదటి ఆస్పత్రిగా కూడా హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి పేరొందిందని శెట్టి పేర్కొన్నారు.

ఓటు వేస్తే.. హెయిర్ కట్ ఫ్రీ


సెలూన్‌లో హెయిర్‌కట్ చేస్తున్న రాధాకృష్ణ

కంచరపాలెం: దేశ తలరాతను మార్చే ఓటు విలువను తెలియజేస్తూ కంచరపాలెంలోని ఓ సెలూన్ యజమాని వినూత్న కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో ఆర్కే స్మార్ట్ ది సెలూన్ షాపు ఎం.రాధాకృష్ణ నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న ఓటు వేసి వచ్చిన వారికి రాత్రి 10 గంటల వరకు ఉచితంగా హెయిర్ కటింగ్, సేవింగ్ చేస్తామని ప్రకటించారు. ఓటుకు ఉన్న ప్రాముఖ్యాన్ని తెలియజేసేందుకు తన బృందంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం వేసవి రైళ్లు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాలకు సమ్మర్‌స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

విశాఖ–చెన్నై ఎగ్మోర్ (08577)సమ్మర్ స్పెషల్ ప్రతీ సోమవారాల్లో సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 24వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో చెన్నై ఎగ్మోర్– విశాఖ(08578)సమ్మర్ స్పెషల్ ప్రతీ మంగళవారాల్లో ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయల్దేరి బుధవారం తెల్లవారు 1 గంటకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 25వ తేదీ వరకు నడుస్తాయి. పూనే–భువనేశ్వర్(01047) సమ్మర్‌స్పెషల్ మే11న ఉదయం 11.30గంటలకు పూనేలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.50గంటలకు విశాఖ చేరుకుని, 10.10గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.45గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–పూణే (01048) సమ్మర్‌స్పెషల్ మే 12వ తేదీన రాత్రి 9.25గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.50గంటలకు విశాఖ చేరుకుని, 4.10 గంటలకు బయల్దేరి మంళవారం ఉదయం 5.30 గంటలకు పూనే చేరుకుంటుంది. ముంబయి–భువనేశ్వర్(01049) సమ్మర్ స్పెషల్ ఈ నెల 11న శనివారం ఉదయం 11.05గంటలకు ముంబయిలో బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 5.45గంటలకు దువ్వాడ చేరుకుని, 5.50గంటలకు బయల్దేరి సోమవారం తెల్లవారం 1.45గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–ముంబయి (01050) సమ్మర్ స్పెషల్ భువనేశ్వర్‌లో ఈ నెల 13వ తేదీ రాత్రి 11గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.45గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 6.50గంటలకు బయల్దేరి మరుసటిరోజు బుధవారం మధ్యాహ్నం 12.15గంటలకు ముంబయి చేరుకుంటుంది.